# ఆర్టీసీ ఆస్తులు.. అద్దెకు

- నిధుల సమీకరణ కోసం యాజమాన్యం ప్రత్యేక చర్యలు
- బస్టాండ్లలోని స్టాళ్లు, షాపులు, హోటళ్లు, పార్కింగ్‌ల కోసం టెండర్లు
- జవవరి 8, 9 వరకు గడువు
- దాదాపు 25వేల ఎస్ఎఫ్‌టీల స్థలం అద్దెకు



సిటీబ్యూరో, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : నగరంలో కొత్త బస్సుల కొనుగోలు కోసం చర్యలు మొదలు పెట్టిన ఆర్టీసీ యాజమాన్యం అనేక మార్గాలను అన్వేషిస్తున్నది. నిధులను సమకూర్చుకోవడం కోసం ఆర్టీసీ బస్టాండ్లలో ఉన్న స్థలాలను లీజుకు ఇవ్వనున్నది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రాంతీయ కార్యాలయాల పరిధిలోని అన్ని రకాల బస్టాండ్లతో పాటు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని హైదరాబాద్, సికింద్రాబాద్ రీజనల్ పరిధిలో ఉన్న జేబీఎస్, సికింద్రాబాద్ బస్టాండ్‌లలో స్థలాలు, స్టాళ్లు, షాపులను లీజుకు ఇచ్చేందుకు ఆర్టీసీ యాజమాన్యం వేరువేరుగా టెండర్ నోటిఫికేషన్లు విడుదల చేసింది. అదేవిధంగా ఎంజీబీఎస్, కోఠి బస్టాండ్లలో కూడా టెండర్లు పిలిచారు. ఇందులో ముఖ్యంగా ఆర్టీసీ గ్రేటర్ పరిధిలోని అన్ని రకాల షాపులు, హోటళ్లు, ఫుడ్‌స్టాళ్లు, పార్కింగ్, లాజిస్టిక్స్ (కార్గో పార్సిల్ సేవలు), డార్మిటరీ వంటి బహుళ రూపంలో ఉన్న స్థలాల కోసం నోటిఫికేషన్ ఇచ్చింది. గ్రేటర్ జోన్ పరిధిలో దాదాపు 25వేల స్క్వేర్ ఫీట్స్ స్థలాన్ని లీజుకు ఇవ్వనున్నట్లు టెండర్లలో పేర్కొన్నారు.

### గడువు ముగియకుండానే..

ప్రస్తుతం ఆర్టీసీ గ్రేటర్ జోన్ పరిధిలో కొనసాగుతున్న వ్యాపార సముదాయాల స్థలాలకు ఇంకా లీజు గడువు ముగియలేదు. అయినప్పటికీ అదనపు బస్సుల కొనుగోలు, మహాలక్ష్మి పథకం కొనసాగింపు నేపథ్యంలో ముందుగానే ఆర్టీసీ యాజమాన్యం వ్యాపార సముదాయాల లీజు కోసం టెండర్లు పిలిచి, జనవరి 8, 9 తేదీలలో గడువు విధించింది. బస్టాండ్లు, ఎక్కువ స్థలాల కోసం ఇ-టెండర్ల ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని, మిగిలిన స్టాళ్ల కోసం మ్యాన్యువల్ విధానంలో టెండర్లు దాఖలు చేయడానికి అవకాశం కల్పించినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. అయితే ప్రస్తుతం కొనసాగుతున్న షాపులపై తీవ్ర ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని లీజుకు తీసుకున్న యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

---

అర్హులను ఎప్పుడు ప్రకటిస్తారు..

## ఆరు గ్యారంటీలను ఎప్పటిలోగా అమలు చేస్తారు.?



నియోజకవర్గం కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్, డిసెంబర్ 30 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను ఎప్పటిలోగా అమలు చేస్తారో స్పష్టం చేయాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. శనివారం మారేడ్‌పల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గం పరిధిలోని ముఖ్య నాయకులు, కార్పొరేటర్‌లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరిస్తున్న దరఖాస్తులలో అర్హులను ఎప్పటిలోగా ఎంపిక చేస్తారనే విషయాన్ని ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. నూతన రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే విధంగా నిర్ధిష్టమైన దరఖాస్తులను కూడా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. ఆరు గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తులు సరిపడా లేని కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కొన్ని చోట్ల కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు కూడా ఉంటున్నాయని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి దరఖాస్తుల కొరత ఏర్పడకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజలకు మేలు చేసే పథకాలకు తాము సహకరిస్తామని అన్నారు. ఆరు గ్యారంటీల కోసం అర్హులైన వారు జనవరి 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం కోరినందున అర్హులైన వారితో దరఖాస్తు చేయించాలని సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని కార్పొరేటర్‌లకు, ముఖ్య నాయకులకు, మాజీ కార్పొరేటర్‌లకు సూచించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ప్రజలే ప్రభుత్వాన్ని నిలదీస్తారని అన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్‌లు మహేశ్వరి, కొలన్ లక్ష్మి, హేమలత, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ముఖ్యనాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తు కేంద్రాలను సందర్శించిన కమిషనర్



యూసుఫ్‌గూడ వెంకటగిరి ప్రజా పాలన కేంద్రంలో అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్ రొనాల్డ్ రాస్

జూబ్లీహిల్స్, డిసెంబర్ 30 : ప్రజా పాలన కేంద్రాలలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ పేర్కొన్నారు. శనివారం యూసుఫ్‌గూడ డివిజన్ వెంకటగిరి కేంద్రంలో ప్రజా పాలన కౌంటర్లను సందర్శించి దరఖాస్తుదారులతో మాట్లాడారు. ప్రజా పాలన కేంద్రాలలో ఏమైనా ఇబ్బందులున్నాయా అని మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దరఖాస్తుల విషయంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. సిబ్బందికి అసౌకర్యం కలుగకుండా చూడాలని.. సమయానికి భోజనం వసతులు కల్పించాలని తెలిపారు. ఆయా కేంద్రాలలో ప్రజలకు, సిబ్బందికి తాగునీటి వసతి కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ ఎ.శైలజ, డిప్యూటీ కమిషనర్ సేవా ఎస్లావత్, ఈఈ యూ.రాజ్‌కుమార్, ఏఎంఓహెచ్ డాక్టర్ కె.ఎస్.రవి, ఏఎంసీ కమల్, డిప్యూటీ ఈఈ శ్రీరాములు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## ఓయూ ఆధ్వర్యంలో.. ఒకేరోజు 102 కళాశాలల్లో సదస్సు



సదస్సుకు హాజరైన అధ్యాపకులు, విద్యార్థులతో నిర్వాహకులు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 30 : మారుతున్న కాలానికి మేనేజ్‌మెంట్ అంశాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.శ్రీరాములు సూచించారు. ఓయూ మేనేజ్‌మెంట్ విభాగం గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భాగంగా వినూత్న ప్రయత్నంగా ప్రపంచ రికార్డు సాధించేందుకు వర్సిటీ పరిధిలోని 102 కళాశాలల్లో 'మోడర్న్ ట్రెండ్స్ ఇన్ గ్లోబల్ మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఆయా కళాశాలల్లో 102 మంది పరిశ్రమలు, విద్యాసంస్థలకు చెందిన నిపుణులు ప్రసంగించారు. మొత్తం 102 కళాశాలల్లో 815 మంది అధ్యాపకులు, 20,350 మంది విద్యార్థులు ఈ సదస్సుల్లో పాల్గొనడం విశేషం. ఓయూలో జరిగిన ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ శ్రీరాములు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బిజినెస్ అనాలెటిక్స్ రంగప్రవేశంతో మేనేజ్‌మెంట్‌లో నూతన పోకడలు చోటుచేసుకుంటున్నాయని చెప్పారు. యుద్ధ వాతావరణం నేపథ్యంలో పెట్రోలియం ఉత్పత్తులతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని తెలిపారు. మేనేజ్‌మెంట్ విద్యను నూతన పోకడలు ప్రభావితం చేస్తాయని అన్నారు. అందుకు అనుగుణంగా పాఠ్య ప్రణాళికలను సైతం మార్చుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ వెంకటయ్య, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ స్మితా సంబ్రాని, ప్రొఫెసర్ వై.జహంగీర్, ప్రొఫెసర్ సుధ, డాక్టర్ విద్యాసాగర్ రావు, డాక్టర్ సమున్నత, డాక్టర్ అర్చన, తదితరులు పాల్గొన్నారు.

## కాలేజీ, ఆసుపత్రి భవనాలను వేగవంతం చేయాలి



సీతాఫల్‌మండిలో కాలేజీ, ఆసుపత్రి భవనాల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ తదితరులు

సికింద్రాబాద్, డిసెంబర్ 30 : సీతాఫల్‌మండిలో కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన ప్రభుత్వ స్కూల్, జూనియర్, డిగ్రీ కాలేజీ భవనాలతో పాటు కుట్టి వెల్లోడి ప్రభుత్వ ఆసుపత్రి కొత్త భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణ పనుల్లో నాణ్యతను పాటించాలని, నాణ్యత విషయంలో రాజీ పడరాదని ఆదేశించారు. శనివారం సాయంత్రం సీతాఫల్‌మండి ప్రభుత్వ కాలేజి భవనాల నిర్మాణ పనులను, కుట్టి వెల్లోడి ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను పద్మారావు గౌడ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వ హయంలోనే ప్రభుత్వ స్కూల్‌లో జూనియర్, డిగ్రీ కాలేజీలను ఏర్పాటు చేశామని తెలిపారు. కొత్త భవనాల నిర్మాణానికి రూ.30 కోట్ల మేరకు నిధులను మంజూరు చేయించామని, పనులు చురుకుగా సాగుతున్నాయని చెప్పారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా కొత్త స్కూల్, జూనియర్, డిగ్రీ కాలేజీ భవనాలను తీర్చిద్దిదాలని సూచించారు. అదేవిధంగా రూ.11.30 కోట్ల వ్యయంతో చేపడుతున్న కుట్టి వెల్లోడి ప్రభుత్వ ఆసుపత్రి భవనాల నిర్మాణాన్ని వేగంగా చేపట్టాలని, మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిగా ఈ ప్రాంగణాన్ని తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సుంకు రాంచందర్, కైరంకొండ యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## మూగబోయిన గొంతుకు పదేండ్ల తర్వాత మాటలు

*అరుదైన వైద్యం నిర్వహించిన ఈఎన్‌టీ వైద్యులు*



సుల్తాన్‌బజార్, డిసెంబర్ 30 : ప్రమాదవశాత్తు మాటలు పోయిన వ్యక్తికి పదేండ్ల తర్వాత ఈఎన్‌టీ వైద్యులు శస్త్ర చికిత్స నిర్వహించి తిరిగి మాటలు రప్పించారు. ఈఎన్‌టీ ప్రొఫెసర్ డాక్టర్ ఆనందాచార్య తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్ జిల్లా కమలాపూర్ మండలం కనిపర్తి గ్రామానికి చెందిన రాము(29) 12 సంవత్సరాల కిందట (2011లో) క్రిమీ సంహారక మందు తాగడంతో స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో, ఆ తర్వాత వరంగల్ జిల్లాలోని ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స చేయించారు. రోగి పూర్తిగా కోలుకున్నప్పటికీ మాటలు రాకుండా పోయాయి. దీంతో పది సంవత్సరాల అనంతరం కోఠిలోని ఈఎన్‌టీ దవాఖానను సంప్రదించగా పరీక్షించిన వైద్యులు ఈ నెల 7న సర్జరీలో భాగంగా డ్యూమన్ స్టంట్‌ను అమర్చి మాటలు ప్రసాదించారు. సుమారు పదేండ్లుగా మాటలు లేకుండా ఉన్న రోగికి మాటలు తెప్పించిన వైద్య బృందాన్ని దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ టి.శంకర్ అభినందించారు. ఈ శస్త్రచికిత్సలో ప్రొఫెసర్ డాక్టర్ ఆనంద్ ఆచార్య, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సంపత్‌రావు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఫణిభూషన్, డాక్టర్ స్వామి, అనస్థీషియా విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఉమా, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీదేవి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఉమా ప్రదీప్, డాక్టర్ నిఖిల తదితరులు పాల్గొన్నారు.



అరుదైన శస్త్ర చికిత్సలో పాల్గొన్న వైద్య బృందం